ఆఫీసు గడియారం పది దాటి పది నిమిషాలు చూపుతూంది. ఆదినారాయణ ఆఫీసుకి రాలేదని అతని ఖాళీ సీటు చెబుతూంది. నా కళ్ళు మాత్రం ఆఫీసు గుమ్మం వైపు, ఆఫీసరు గది వైపు మార్చి మార్చి చూస్తున్నాయి. ఆఫీసరు పిలుపే ముందు వినిపిస్తుందో, ఆదినారాయణే ముందుగా ప్రత్యక్షమవుతాడో దేవుడికే తెలియాలి. ఆదినారాయణ ముందు వస్తే అతడు నిద్ర లేచిన వేళా విశేషం మంచి దనుకోవాలి. లేదూ, ఆఫీసరే ముందుగా పిలిస్తే ఆదినారాయణ ఆఫీసరు దృష్టిలో మరో మెట్టు కిందికి దిగిపోవడం నిజం. కిందికి దిగిన వాడు పాతాళానికి జారిపోవడం పచ్చి నిజం! ఊహించడానికి నాకే భయం కలిగింది.

ఆదినారాయణ ఆఫీసుకి లెక్కలేనన్ని సార్లు ఆలస్యంగా రావడమూ జరిగింది; అందుకు ప్రతిఫలంగా ఆఫీసరుచేత తిట్లూ, చీవాట్లూ తినడమూ జరిగింది. అభిమానమున్న మనిషి ఎవడైనా ఆ మాటలు భరించలేక వేళకి ఆఫీసు గుమ్మంలో అడుగైనా పెడతాడు, లేదా ఉద్యోగానికి ఒక దండం పెట్టి శాశ్వతంగా సెలవైనా తీసుకుంటాడు. ఆ రెండూ చేయలేక పోయాడు ఆదినారాయణ. చేయలేడు కూడా! అందరిలా అభిమాన మనేది ఆదినారాయణకూ ఉంది. కాని, అతని చీకటి బ్రతుకులో ఆ అభిమాన మనేది శాశ్వతంగా నిద్రపోయింది. ఎప్పుడైనా బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని లేచినా, ఆదినారాయణ జోకొట్టి నిద్రపుచ్చుతాడు. ఆఫీసుకి ఆలస్యంగా రావడం, ఆఫీసరుచేత తిట్లూ, చీవాట్లూ తినడం అతనికి అలవాటుగా మారిపోయింది. విషం మింగి జీర్ణించుకున్నట్లు ఊరుకోవడం తప్ప మరో దారి లేదు అతనికి.

మరో అయిదు నిమిషాలు మెల్లిగా దొర్లిపోయాయి. ఆఫీసులో అంతా ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు. అంత మందిలో ఆదినారాయణ గురించి ఆలోచిస్తున్నది నే నొక్కడినే ఏమో? ఫైలు తెరిచానన్న మాటేగాని, నా కేమిటో ఆయోమయంగా ఉంది. క్షణ క్షణానికి నాలో ఆత్రత అధికం కాసాగింది.

లోపల్నుండి బజ్జర్ నొక్కాడు బాస్! నా వెన్ను మీద ఎవరో బలంగా చరిచినట్లు ఉలిక్కిపడ్డాను. ఇంకేమిటి? భయపడినంతా జరిగింది.

కర్టెన్ తొలగించుకుని లోనికి వెళ్లిన ప్యూన్ చంద్రయ్య మరు నిమిషం బయటికొచ్చాడు. అతని చూపులు ఖాళీగా ఉన్న ఆదినారాయణ సీటు వైపు మరలేసరికి బాస్ ఎవరిని పిలిచింది అర్థమయింది నాకు. చంద్రయ్య తిరిగి లోనికి వెళ్లిన కాసేపటికి, బాస్ సింహగర్జన వినిపించింది.

"నో డిసిప్లిన్ ... నో పంక్చువాలిటీ!" అసహనంగా పలుగుడులోకి దిగిపోయాడు.

నా మనసులోని ఆలోచనలు, గడియారం లోని ముళ్ళు ముందుకి పారిపోతున్నాయి. మరో పది నిమిషాలు గడిచాయి. ఆదినారాయణ ఆత్రతగా ఆఫీసులో అడుగు పెట్టాడు. ముఖం నిండా పట్టిన చెమట, కళ్లలో తొంగి చూస్తున్న భయం, అతని శరీరంలో ఆందోళన, అతని అడుగుల్లో తడబాటు నా మనసుని జాలితో నింపేశాయి. అతని అమాయకమైన చూపుల్ని తట్టుకునే ధైర్యం లేక పనిచేస్తున్నట్టు నటించసాగాను.

"ఆదినారాయణగారూ! మిమ్మల్ని అయ్యగారు పిలిచారు." చంద్రయ్య వచ్చి చెప్పడంతో భయంగా సీటు నుండి కదిలాడు.

"మిస్టర్ ఆదినారాయణా! దిసీజ్ ఆఫీస్! ఆలస్యంగా రావటం అలవాటుగా మారిపోయింది నీకు. నీ ఇష్టం వచ్చినప్పుడు రావడానికి కాదు నీకు జీతం ఇచ్చేది. దిసీజ్ లాస్ట్ వార్నింగ్! ఇక మీదట నో ఎక్స్‌క్యూజ్! ఐ విల్ టేకిట్ సీరియస్లీ!" నోటి కొచ్చింది అన్నాడు బాస్.

తల దించుకుని ఎప్పటిలాగే మౌనంగా వచ్చేశాడు ఆదినారాయణ. ఆఫీసులో అంతా అతని వైపు వింతగా చూశారు. నానావిధాల మాట్లాడుకున్నారు. నవ్వుకున్నారు. జోకు లేసుకున్నారు. వాటన్నిటికీ అలవాటుపడిన ఆదినారాయణ తన పనిలో మునిగిపోయాడు. నాకుమాత్రం అందరూ కలిసి నన్నే అవమానించినంత బాధ కలిగింది.

మానవత్వం లేని మనుషులు! బ్రూట్స్! బాధపడుతున్న మనిషిని చూసి కనీసం జాలైనా చూపకపోగా హేళన చేస్తున్నారు. మనిషికీ, మనిషికీ మధ్య ఎందుకీ కక్ష? ఇంతలేసి దూరాలెందుకు?

పుట్టిన ప్రతి మనిషికి జీవితం వడ్డించిన విస్తరి కాదని వీళ్లకి ఏమైనా తెలుసా? ఆ నిజమే తెలిసి ఉంటే ఇలా ఒక అమాయకుణ్ణి ఆట వస్తువుగా మార్చి హేళన చేసేవారు కాదు. ఆదినారాయణ గురించి నే నింతలా బాధపడుతున్నానంటే కారణం—అతని విషాద చరిత్ర నాకు బాగా తెలుసు. ఇద్దరం ఒకే రోజున ఆఫీసులో చేరాం. ఒకటిగానే కలిసి తిరుగుతున్నాం. అతని హృదయం లోతులతో నా కెంతో పరిచయం ఉంది.

కాలం కాటేసిన మనుషులలో ఆదినారాయణ ఒకడు! అతని కళ్లలో ఎప్పుడూ దైన్యం తొంగిచూస్తుంది. అతని ముఖంలో ఎప్పుడూ విషాదం నిండి ఉంటుంది. అతని చేతల్లో ఎప్పుడూ అలసట కనిపిస్తుంది. అతని గుండెలో బాధలు నిత్యం మండుతూనే ఉంటాయి. ముప్పై దాటుతున్న ఆదినారాయణలో అప్పుడే ముసలి లక్షణాలు తొంగి చూస్తున్నాయంటే అంతగా ఆశ్చర్యపోనక్కర లేదు.

ఆదినారాయణకు ఆరేళ్ల క్రితం పెళ్లి అయింది. ఆరేళ్లలో ముగ్గురు పిల్లలు పుట్టి సంసారం పెద్దది చేశారు. వయసు మళ్లిన తల్లితండ్రులు అతని బ్రతుకులో వయసులు తీరేదాకా బ్రతకాలని బ్రతికి ఉన్నారు. పెళ్లీడుకి వచ్చిన చెల్లి ఉంది. బడిలో చదువుకునే ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. అంతమందికి అవసరాలు తీర్చే యంత్రం ఆదినారాయణ!


నిద్ర లేచింది మొదలు అతనిలో ఆందోళన బయలుదేరుతుంది. తిండి, బట్ట, చదువు, పంచదార, పాలడబ్బా—క్షణానికో సమస్య ఎదురవుతుంది! నెలకు వచ్చే రెండు వందల ఏభైతో అతడు ఎన్నని పరిష్కరించగలడు? ఎందరి అవసరాలు తీర్చగలడు? తన నిస్సహాయ స్థితికి కుమిలి కుమిలి ఏడ్చే నిర్భాగ్యుడు. ఫస్టు తేదీని పావలా పెట్టి కాఫీ తాగడానికి నోచుకోని దురదృష్టవంతుడు. తనకోసం బ్రతకడం ఏనాడో మరిచిపోయిన అతి సామాన్యుడు ఆదినారాయణ! భగవంతుడు అతని నుదుట సుఖశాంతులు అనే రెండు రేఖలు గీయడం మరిచిపోయి ఉండాలి.

పట్నంలో పాపంలా పెరిగిపోతున్న ఇళ్ల అద్దెలను భరించే ఓపిక లేక ఆరు మైళ్ల దూరంలో మకాం పెట్టాడు. ఇంటి అద్దెలో కొంత కలిసి వస్తుందని ఆశపడ్డాడు తప్ప, ఎదురయ్యే కష్టాలను మాత్రం అతడు ఆలోచించలేదు. అందుకే సమయానికి బస్సు అందకపోయిన పాపానికి, జేబులో డబ్బులు లేని సమయాల్లో కాలినడకను ఆఫీసుకి చేరడం ఆలస్యమైన కారణానికి అతనికి ఆఫీసరు చేత చీవాట్లు తినడం అతి మామూలయిపోయింది.

అలా మాటిమాటికి ఆఫీసుకి ఆలస్యంగా రావడం, ఆఫీసరు చేత మాటలు పడడం, నలుగురు అతని గురించి హేళనగా మాట్లాడడం—ఇవన్నీ శాశ్వతంగా దూరం చెయ్యడానికి ఒక సెకండ్ హాండు సైకిలైనా కొనుక్కోమని ఎన్నోసార్లు చెప్పాను. ఆ విషయం ఎత్తినప్పుడల్లా విషాదంగా ఓ నవ్వు పారేసి, "నాకు అంత చిన్న అదృష్టం కూడా లేదు, గంగాధరం! నా పదేళ్ల సర్వీసులో నెలకు కనీసం ఒక్క రూపాయి మిగిల్చినా నువ్వు చెప్పినట్టు ఈసరికి ఒక సెకండ్ హాండుదైనా కొనగలిగేవాడిని. కాని ... నీకు తెలియని



"దిగు దిగు నాగా" చిత్రం—డి. అన్నపూర్ణ (మద్రాసు—28)



- యస్సేరావ్

దేముందిలే చెప్పడానికి ... అన్నట్టు ఈ రోజు పేపరు చూశావా? మరో మూడు నెలల లోపున పే కమీషన్ వాళ్ల రిపోర్టు ఇస్తారట" అని మరో విషయం పైకి మాట మళ్లిస్తాడు.

నిజమే. అతని గురించి నాకు తెలియని దేముంది? అది తెలివి తక్కువ ప్రశ్న అని తెలిసినా నేను అప్పుడప్పుడు అడగడం మానలేదు. ఆదినారాయణ మీద నాకు ఉన్న అభిమానమే అలాంటి చచ్చు ప్రశ్నలు వేయిస్తుంది.

ఆదినారాయణతో అంత సన్నిహితంగా మెలిగే నేను అడపాదడపా అయిదు, పది సర్దడం తప్ప, మరో విధంగా సహాయ పడలేనందుకు బాధగానే ఉంది. కాని, ఏం చెయ్యను? ఎవరి బాధలు వారివి! ఎవరికి ఉండవలసిన సమస్యలు వారికి ఉంటాయి.

* * *

ముఖ్యమైన పేపర్లు కొన్ని చూడవలసిన పని ఉండి ఆ రోజు అరగంట ముందు బయలుదేరాను ఆఫీసుకి.

ఆఫీసు మెయిన్ గేటు దాటుతున్న నేను వెనక నుండి, "సార్!" అన్న పిలుపుకి అమాంతం వెనుదిరిగాను.

అపరిచితమైన ఒక వ్యక్తి సైకిల్ తోసుకుంటూ నన్ను చేరాడు. అతనికి సుమారు పాతికేళ్లుంటాయి. అతని ఒంటిమీద అక్కడక్కడ మాసె మరకలతో ఉన్న కాకీ రంగు బట్ట లున్నాయి. సైకిల్ హాండిల్‌కి వ్రేలాడుతున్న గోనె సంచీలో కారియర్ వంటి దేదో ఉంది.

అతణ్ణి అంతకు ముందు నేను ఎప్పుడూ, ఎక్కడా చూడలేదు. ఏమి కావాలన్నట్టు ప్రశ్నార్థకంగా చూశాను అతని వైపు.

తన చేతిలో ఉన్న సైకిల్ వైపు కాసేపు, నావైపు కాసేపు చూపులు మారుస్తూ ఉండిపోయాడు — ఏదియు పడుతున్నట్టు!

అతడు ఏదో చెప్పడానికి సంకోచిస్తున్నాడని గ్రహించి, "ఏం కావాలండి మీకు?" అని ప్రశ్నించాను.

"అబ్బే! ఏమీ లేదండి. ఈ సైకిల్ . . . సైకిల్ . . . అమ్మేయ్యా లనుకుంటున్నాను. మీ ఆఫీసులో ఎవరికైనా అవసరముంటే మీకు తెలుస్తుందేమోనని! డబ్బుకి ఇబ్బందిగా ఉండి అమ్మెయ్యవలసి వచ్చిందండి. నేను హార్బరులో కలాసీగా పని చేస్తున్నాను. నా భార్యకు వారం రోజుల నుండి జబ్బుగా ఉంది. చేతిలో చూస్తే చిల్లి గవ్వ లేదు. తప్పని పరిస్థితుల్లో అమ్మవలసి వచ్చింది. నాకున్న ఆస్తి అంతా ఈ సైకిలే! దానికి కూడా ఋణం తీరిపోయే సమయ మొచ్చింది." చెప్పలేక చెబుతున్న అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ కన్నీటి తెరల వెనక అతని అవసరాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి.

అవసరం మనిషిని ఎంత దూరమైనా తోస్కు వెళుతుంది. ఏ పనైనా చేయిస్తుంది. ఏ ఆస్తీ లేని — లేనివాడికి చేతిలో ఉన్న ఓ చిన్న వస్తువైనా ఆపదలో ఆదుకునే మిత్రుడిలా కనిపిస్తుంది. తన ఇల్లాలి ఆరోగ్యంకోసం అతను పడుతున్న ఆవేదన, ఆరాటం మరో మనిషి మాటలతో చెప్పలేనివి.

ఈవేళో, రేపో అతను సైకిల్ ఎవరికైనా అమ్మేస్తాడు. ఆ డబ్బుతో తన భార్యను బ్రతికించుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆ తరవాత ఆదినారాయణలా తన ఆఫీసరు చేత ప్రతి రోజూ చీవాట్లు తింటాడు. ఇది నిజం!

ప్రేమ కథలు వ్రాసే రచయితలందర్నీ సమావేశపరిచి, 'పనికి రాని ప్రేమ కథలు కట్టిపెట్టి కళ్లు తెరవండి. ఈ దీన జనుల్ని చూడండి. వీళ్ల గురించి వ్రాయండి కథలు. మీకు కావలసినంత మెటీరియల్ దొరుకుతుంది. మీ జన్మ తరిస్తుంది. మీ పేరు ప్రఖ్యాతులు పది కాలాల పాటు నిలబడతాయి' అని లెక్చరివ్వా లనిపించింది.

ఆలోచనల్ని కట్టిపెట్టి సైకిల్‌వంక పరీక్షగా చూశాను. చూడటానికి కొంత పాతగా కనిపించినా, భాగాలన్నీ కండిషన్లో ఉన్నట్టుగా కనిపించాయి. కాబట్టి అవసరమున్నవాళ్లెవరైనా బేరమాడి కొనుక్కోవచ్చు. ఆ డబ్బుతో అతడు తన అవసరాల్ని తీర్చుకోవచ్చు.

మా ఇల్లు ఆఫీసుకి దగ్గర్లోనే కాబట్టి సైకిల్ అవసరం నాకు ఉండదు. కానీ, రోజూ ఆఫీసరుచేత దీవెనలు అందుకుంటున్న ఆదినారాయణకు అది అత్యవసరం. ఇతడు సైకిల్ అమ్మడానికి సిద్ధపడుతున్నాడు. కానీ, కొనడానికి ఆదినారాయణ సిద్ధంగా లేడని నాకు తెలుసు. ఇతనికి వెంటనే డబ్బు అవసరం. కానీ, ఆదినారాయణ దగ్గర లేనిదల్లా ఆ డబ్బే! ఏమి చెయ్యడానికి పాలుపోలేదు నాకు. చూస్తూ చూస్తూ బంగారం లాంటి సైకిల్ వదిలి పెట్టడానికి మనస్కరించడం లేదు. ఆలోచిస్తూ ఉండిపోయాను.

నేను మౌనంగా ఉండటం చూసి, "సార్! మీ రెందుకో ఆలోచిస్తున్నారు. ఈ సైకిల్ నా కష్టార్జితం. మా బావమరిది కటకం వెళ్లిపోతూ నూటఏభై రూపాయలకు ఇచ్చి వేశాడు. నా దగ్గర రసీదులు కూడా ఉన్నాయి—మీరు చూస్తానంటే" అంటూ జేబులోనికి చెయ్యి పోనిచ్చాడు.

అతని అమాయకత్వానికి నాకు జాలేసింది. "ఫర్వాలేదు! ఉంచండి. నా అనుమానం అది కాదు. ఈ సైకిల్ ఎంతకు ఇవ్వదలుచుకున్నారో చెప్పండి" అన్నాను బేరంలోకి దిగుతూ.

తక్కువలో ఉంటే ఏదో విధంగా ఆదినారాయణచేత కొనిపిద్దామనే ఉద్దేశంతో! ఇలాంటి అవకాశం మళ్లీ రాదు.



ఆదినారాయణ అదృష్టం బాగుపడినట్టుంది. ఇకమీదట తల దించుకొని ఆఫీసరు సుప్రభాతం వినక్కర్లేదు.

"డబ్బు అవసరంలో ఉన్నాను కనక ఒక వంద రూపాయలు ఇప్పించండి చాలు! మీ మేలు జన్మలో మరిచి పోలేను."

వెంటనే నేనేమీ జవాబు చెప్పలేదు. సైకిల్‌కి స్టాండు వేసి కాసేపు అటూ ఇటూ తిప్పుతూ పరీక్షిస్తున్నట్టు నటించసాగాను. "చూడండి! ఫ్రీవీలు లూజుగా ఉంది. ఈ ముందు రిమ్ము బాగా పాతబడింది. వెనక టైరు మార్చుకోవాలి. బ్రేకులు కూడా ఒక మాదిరిగా ఉన్నాయి. బాగా వాడినట్టుందే?" ఏదో వంక చూపించకపోతే బేరం దిగదు కదా అని లేని లోపాల్ని వెదకసాగాను.

"అంత పాతది కాదు, సార్! మా బావమరిది దగ్గర కొని రెండు సంవత్సరాలే అయింది. ఈ సైకిల్ మీకే అవసరం అయితే అయిదు రూపాయలు తగ్గించేస్తాను. చెప్పండి."

"నాకు కాదు, మా ఫ్రెండ్ ఒకతనికి కావాలి. అతడూ మీలాంటి వాడే! అంతగా డబ్బు లేదు అతని దగ్గర. అరవై రూపాయల వరకైతే కొనగలడు" అన్నాను.

ఆదినారాయణ లేనివాడు. ఇతడు కూడా లేనివాడే! ఒక లేనివాడికి మేలు చెయ్యడంకోసం తెలిసీ మరో లేనివాడిని డిసీవ్ చేస్తున్నాను. ఉన్నవాడూ లేనివాణ్ణే మోసం చేస్తున్నాడు. లేనివాడూ లేనివాణ్ణే మోసం చేస్తున్నాడు. ఇది లోకం తీరు! లోకంలో నేనూ ఒకణ్ణి కనక ఆ క్షణాన నేనూ లోకం తీరునే అనుసరించాను.

నే నేమీ మాట్లాడక పోయేసరికి అతడు తొంభై రూపాయలకు దిగాడు. నేను అరవై అయిదుకి ఎక్కాను. మరో అయిదు నిమిషాలకు అతడు మరో అయిదు రూపాయలు తగ్గించాడు. కొంతసేపు బేరమాడి నేను అయిదు రూపాయలు ఎక్కించాను. ఆఖరికి ఎనభై రూపాయలతో ఆగిపోయాడు అతను. ఇక ఎవరూ ఎక్కా దిగకుండా ఆ ఎనభైకే సెటిల్ చేశాను నేను కూడా.

నా చాతుర్యానికి నాలో నేను మురిసి పోయాను. నిజానికి ఆ సైకిల్ నూట పాతికైనా చేస్తుంది. కాని, ఎనభై రూపాయలకు బేరం కుదిరిందంటే అందుకు నా తెలివి తేటలే కారణం అనే కన్నా అతని అవసరమే కారణ మయిందంటే బాగుంటుంది. ఏది ఏమైనా ఆదినారాయణ లక్కీ ఫెలో!

ఇంతా బేరమాడేశాను. ఆ తరవాత ఆదినారాయణ 'నాకొద్దు మొర్రో!' అంటే? నో, నో! ఈ సారి అలా జరగడానికి వీల్లేదు. ఆరు నూరయినా ఆదినారాయణ చేత కొనిపించి తీరుతాను.

"ఏమోయ్, గంగాధరం! పదయినా ఇంకా ఆఫీసు బయటే ఉన్నావు?" ఆదినారాయణ కూడా ఆ సమయానికే వచ్చాడు.

వాచీకేసి చూశాను. గుడ్ గాడ్! పది దాటిపోయింది. ఆఫీసులో ఒక్కరొక్కరే చొరబడుతున్నారు. ఆలస్యం అయితే ఆఫీసరుచేత అక్షింతలు వేయించుకోవాలి. అందరూ నవ్వుతూ ఉంటే నేల చూపులు చూస్తూ నోరు మూసుకోవాలి. అది నా కిష్టం లేదు. తొందరగా వ్యవహారం పూర్తిచెయ్యా లనిపించింది.

"ఆదీ! ఈ సైకిల్ చూడు—ఎలా ఉంది? నీకు నచ్చిందా?"

ఆలోచనలో పడ్డాడు ఆదినారాయణ.

"అబ్బబ్బ! నీ ఆలోచనలతో చంపక నచ్చిందా? లేదా? ఏదో ఒకటి చెప్పు. అవతల ఆఫీసుకి టైమవుతుంది" అన్నాను తొందరపెడుతూ.

నచ్చింది అన్నట్టు తల ఊపాడు.

ఆ సైకిల్ స్వంతదారుని వైపు తిరిగి, "చూడండి! ఈవేళ మేము డబ్బు తీసుకురాలేదు. రేపు ఉదయాన్నే మీరు సైకిల్, రసీదులు తీసుకొస్తే డబ్బిచ్చేసి తీసుకుంటాం" అని అతణ్ణి సాగనంపేసి ఆఫీసులో అడుగుపెట్టాం.

లంచ్ అవర్‌లో ఆదినారాయణకు ఆ సైకిల్ కథ అంతా చెప్పాను. అంతా విని 'కానీ' లతో మొదటి కొచ్చాడు.

నాకు ఒళ్లు మండుకొచ్చింది. అదృష్టం వెదుక్కుని వచ్చినట్టు ఎనభై రూపాయలకు బంగారం లాంటి సైకిల్ వస్తుంటే ...!

"చూడు, ఆదీ! ఈ అవకాశం వదులుకుంటే నీ కీ జన్మలో సైకిల్ కొనే గీత ఉండదు. ఉన్న కాస్త గీత తుడుచుకుపోతుంది. ఇలా రోజూ నిన్ను ఆ 'ఏస్' తిడుతూ ఏదో ఒక రోజున నీ ఉద్యోగానికి జనగణమన పాడించేస్తాడు. ఆ తరవాత నీ ఇష్టం. ముప్ఫై రూపాయల వరకూ నేను సర్దుబాటు చెయ్యగలను. మిగిలిన ఆ ఏభై ఎలాగో తంటాలుపడి సంపాదించు" అన్నాను.

"అలాగే ప్రయత్నిస్తాను" అని ఒప్పుకున్నాడు.

అయినా, నాకు నమ్మకం కుదరలేదు. అవును! తను మాత్రం అంత డబ్బు అమాంతం ఎక్కడినుండి తెస్తాడు? అనాలోచితంగా మాట్లాడినందుకు కొంచెం బాధపడ్డాను.

కానీ, మరునాడు ఉదయం తొమ్మిది కల్లా ఏభై రూపాయలతో ప్రత్యక్షమయిన ఆదినారాయణను చూసి ఆశ్చర్య పోయాను.

"ఎక్కడ సంపాదించావు?" అడగకుండా ఉండలేకపోయాను.

"నువ్వు బాధపడనంటే చెబుతాను, గంగాధరం! మా రెండోదానికి చిన్నప్పుడు ఎప్పుడో చేయించిన చెవి రింగులు వద్దంటున్నా వినకుండా మా ఆవిడ తాకట్టు పెట్టి ఇచ్చింది. బోసిపోయిన ఆ పసిదాని చెవులు చూస్తుంటే ...!" బొంగురుపోయింది అతని స్వరం. సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్లను జేబురుమాలుతో తుడిచేసుకున్నాడు.

నా మనస్సు కలుక్కుమంది.

ఆదినారాయణ తెచ్చిన ఏభై, నా దగ్గర మిగిలిన ముప్ఫై పెట్టి ఆరోజే సైకిల్ కొనేశాం.


అతని విషాద వదనంలో రవ్వంత ఉత్సాహం తొంగి చూసింది. అందరాని దేదో అందినంత ఈజీనెస్ ఫీలయ్యాడు ఆదినారాయణ. నా పట్ల అతని కళ్లలో కృతజ్ఞతాభావం కనిపించింది. అతని సంతోషం చూసి నా మనసు కొంత తేలికపడింది.

ఆ మరుసటి రోజు నుండి పదయ్యే సరికి ఆదినారాయణ తన సీటులో ప్రత్యక్షమయ్యేవాడు. ఆఫీసరు గొంతు చించుకోవడమూ, ఆఫీసులో చిల్లర గొంతులు హేళన చెయ్యడమూ — ఇవన్నీ శాశ్వతంగా దూరమవుతాయనే ఆశ చిగురించింది నాలో!

* * *

వారం రోజులు సాఫీగా గడిచి పోయాయి.

ఒక రోజు ఉదయాన్నే ఆదినారాయణ, నేను కలిశాం. ఆఫీసుకి ఎదురుగా ఉన్న హోటల్‌లో కాఫీ తాగి, ఆఫీసు గేటు



పంచగంగ పావనతీర్థం ఫోటో—ఎస్. బి. టకల్కర్ (కొల్హాపూర్)

# వినికిడి సమస్య

మీ వినికిడి ఎందుకు తగ్గిపోయినది, మీ సమస్యను పరిష్కరించేందుకు ఏమి చెయ్యవలసినదీ మీరు అవశ్యం తెలుసుకోవాలి.

మీకు సహాయపడేందుకు మా హియరింగ్ ఎయిడ్ కన్సల్టెంట్ త్వరలో మీ ప్రాంతానికి రాగలరు. మీరు ఆయనను సంప్రదించి, మీ చెవుడు యొక్క రకాన్ని, తీవ్రతను బట్టి అమర్చుకొనదగిన శాస్త్రీయమైన వినికిడి సాధనం కొరకు ఉచిత పరీక్ష పొందగలందులకు, ఆయన పర్యటన కార్యక్రమం తెలుసుకునేందుకు మాకు వ్రాయండి, లేదా మీరు చదివే దినపత్రికను చూస్తూండండి.

**హియరింగ్ ఎయిడ్ సెంటర్** 13/2, శివజ్ఞానం రోడ్డు, పాండీ బజార్, త్యాగరాయనగర్, మద్రాసు-17.

**హియరింగ్ ఎయిడ్ సెంటర్** రాక్సీ సినిమాకు ఎదురుగ, డాక్స్: 3677, బొంబాయి-4.

ఆర్పి - ఆటికన్ హియరింగ్ ఎయిడ్స్ యొక్క ఏకైక డిస్ట్రిబ్యూటర్లు

**"Hearing Happiness Despite Deafness"**

అను పుస్తకంయొక్క ఉచిత కాపీ కొరకు వ్రాయండి.



# లాజిన్

పేలు, ఈపి చుండ్రు నివారిణి



5 శక్తివంతమైన మూలికాసారములతో తయారుకాబడిన పరిమళ తైలము

- 1. లాజిన్: రాసిన కొద్ది గంటలలో ...
- 2. లాజిన్ తలలోని చుండ్రును పోగొట్టి వెంట్రుకలు ఊడుటను అరికట్టును.
- 3. లాజిన్ ఘాటైన సువాసనతో ప్రకాశించదగిన పేల మందు.
- 4. లాజిన్ ఒకసారి రాసిన పేలు పూర్తిగా పోవును.

లాజిన్ అన్నిచోట్లలో దొరకును.




తయారుచేయువారు
శ్రీ విజయాశ్రమమ్. రేపల్లె. (ఆం.ప్ర)


దాటుతున్న మా కాళ్ళు తక్కున ఆగిపోయాయి.

ఆఫీసు ఆవరణలో ఇద్దరు పోలీసులు—గళ్ళచొక్కా, మోకాళ్ళ మీదుగా మడిచిన పాంటు, రేగిపోయిన జుత్తుతో ఉన్న ఒకతణ్ణి బాదుతున్నారు. ఆ గళ్ళచొక్కాని పరీక్షగా చూశాక నా గుండె ఆగినంత పనయింది.

అత నెవరో కాదు! ఆ రోజు కాకీ బట్టల్లో కలాసీనని చెప్పుకుని మాకు సైకిల్ అమ్మినవ్యక్తే! పక్కన పోలీసులు, అతని అవతారం చూసేసరికి నాకు నిలువునా భయం వేసింది.

పక్కనే ఉన్న పోలీసు చెయ్యి తపీమని అతని తలమీద పడింది. "అయ్యబాబోయ్!" అని పెద్దగా ఏడుస్తూ చెయ్యెత్తి మమ్మల్ని చూపించాడు.

పోలీసు లిద్దరూ టకటక బూట్లు ఆడించుకుంటూ మమ్మల్ని చేరుకున్నారు. ఆ ఇద్దరిలో ఒకడు సన్నగా రివటలా ఉన్నాడు. మరొకడు నల్లగా, బొద్దుగా ఉన్నాడు.

"మీరేనా ఇతని దగ్గర సైకిల్ కొన్నది?" అడిగాడు ఆ ఇద్దరి పోలీసుల్లో ఒకడు, ఆదివారాయణను ఉద్దేశిస్తూ. కోర్టులో ప్రాసిక్యూటరైనా అంత అధికారంగా అడగడేమో!

"అవునండి!" అన్నాడు ఆదివారాయణ నిలువునా వణికిపోతూ.

"అయితే, పోలీసు స్టేషనుకు పదండి!" లాఠీతో కొట్టినంత గట్టిగా అరిచింది రివట పోలీసు గొంతు.

అప్పటికే దారినిపోయే దానయ్యలు, పనిలేని పుల్లయ్యలు, పో కాల్డ్ పెద్ద మనుషులు చుట్టూ పోగయ్యారు. అంతా మమ్మల్ని చూసి వీధి వినోదం చూసినట్టు ఎంజాయ్ చేస్తున్నారు.

"ఇంతకీ ఏం జరిగిందండి?" ధైర్యం చేసి అడిగాను.

"వీడో పెద్ద కేడీ! ఎక్కడెక్కడో సైకిళ్ళు కాజేసి అమ్ముకొని బ్రతకడమే వీడి వృత్తి—వీడి బాబుగారి సొమ్మన్నట్టు! మీరు అతని దగ్గర కొన్న సైకిల్ దొంగ సరుకు! ఈ దొంగ సన్యాసి అమ్మడం ఎంత నేరమో, ఆ దొంగసొత్తుని మీరు కొనడం అంతకన్నా పెద్ద నేరం."

నేను నిర్ఘాంతపోయాను.

"అది దొంగ సరుకని మాకు తెలియదండి! రసీదులూ అవి చూపించిన మీదటే కొన్నాం!" అన్నాను, మా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనే ప్రయాసతో.

"దొంగతనం చేసేవాడికి దొంగ రసీదులు పుట్టించడం అంత కష్టమైన పనా, చెప్పండి? అవన్నీ మాకు తెలీదు. మీరు చెప్పదలుచుకున్న దేదో కోర్టులో

